# హోటలు పరిచయుడు

కె. కుటుంబరావు

నేనూ, నాదెళ్ళా, మద్దూరీ, పంచాంగమూ ఆఆరవహోటల్లో భోంచేస్తూ ఉండేవాళ్ళం. పంచాంగంమటుకు హోటల్లోనే గది తీసుకుని ఉండేవాడు. మా ఆదివారాలూ శలవరోజులూ అక్కడే గడిచిపోతూండేవి. కారణమేమంటే హోటలుకుర్రాణ్ణి కేకేసినప్పుడల్లా కావలిసిన కాఫీ పట్టుకొస్తూండేవాడు. వెళ్ళేటప్పుడు తలా ఒక అణా బేడా వాడిచేతిలో పెట్టేవాళ్ళం. కాఫీ ఖర్చుమటుకు పంచాంగంవాడి ఖాతాలో పడేది.

అదే ముఖ్యమైనవిషయం. ఆ రోజుల్లో మేం ఆవిధంగా జీవించేవాళ్ళం — సాధ్యమైనంతవరకు మాఖర్చు మరెవడిమీదనైనా వేస్తూ. అదేమామూలు మనుష్యులుచేస్తే అది నీచత్వం అనిపించుకోవచ్చు. మరేమన్నా అనిపించుకోవచ్చు. కాని మాకది ఒక జీవితలక్ష్యం, ఒక పరమార్థం. ఆవిధంగా జీవించి డబ్బులు వెనకేసి కొంపలు కట్టిద్దామని కాదు. అందులో నిజంగా పైకి కనిపించేటంత తప్పేమీ లేదు. అందరూ ఆ విధంగా జీవించటం మొదలుపెడితే లేనివాడికూడా కలవాడితోపాటు జీవించేఅవకాశం వొస్తుందని మాకో గట్టివిశ్వాసం. అట్లా జీవించటంవల్ల మనుషులమధ్య సాంఘిక సంపర్కం జాస్తిఅవుతుందని మాకో నమ్మకం కూడా ఉండేది...ఒకవేళ అటువంటి ప్రవర్తనలో ఏమాత్రం తప్పుగాని ఉంటే, అప్రయత్నంగా అందరూ చెయ్యటానికి ప్రయత్నించే పనేగనక, అటువంటివి ప్రయత్నపూర్వకంగా సిద్ధాంతరీత్యా చెయ్యటంవల్ల దానికి కొంత సంస్కారం ఆపాదించుకుంటుందని మా ఆశ.

నిజానికి జీవితంలోగాని మనుషుల్లోగాని మంచిఅంటూ ఆటేఉందనే నమ్మకం మాలో ఎవరికీ లేదు. పెళ్లిళ్ళలో అల్లుళ్లు అలగటంలోనూ, ఆడబిడ్డలు అన్నదమ్ముల దగ్గర్నుంచి వస్తువాహనాలు రాబట్టుకోవటంలోనూ, అక్కరలయినప్పుడు చుట్టపక్కాలొచ్చిపడి తిని కొంచెంలోటొస్తే చెడతిట్టిపోవటంలోనూ మాకేమీ సంస్కారం కనిపించలేదు. కాని సంఘములో అటువంటివి ఉంటూనేఉన్నై. మాలో మేం సినిమాకెళ్లాలనుకున్నా, కాఫీహోటలు కెళ్దామనుకున్నా ఎవడోఒకడికి జరిమానా విధించటంలో అంతకన్న ఎక్కువ సంస్కారమేఉన్నట్టు కనిపించింది. లేనివాడిదగ్గర డబ్బు ఎట్లాగూ వసూలు చెయ్యలేం. ఇవాళ ఫైనుచెల్లించుకున్నవాడు రేపు తనవంతు వచ్చినప్పుడు మరొకడిచేత చెల్లింపజేస్తాడు. కేవలమూ సాంస్కారికమైన ఒత్తిడేకాని సాంఘికమైన ఒత్తిడికాదు. ఫైనువేసుకునే తాహతు ఉండికూడా స్వార్థంకొద్దీ తప్పించుకోజూసినవాడు మా సాంగ



"ఏమోయి నాలుగురోజుల్లో ఇస్తానని పదిరూపాయలు తీసుకుంటివి. ఇంకా ఇవ్వలేదేం?
"ఆగవోయ్ తొందరేముంది! నీకంటే ముందిచ్చినవాళ్లు చాలామంది ఉన్నారు."

త్యానికి దూరమైపోతాడు! వాడి కదే శిక్ష!

మమ్మల్ని చూసి చాలామంది భయపడేవాళ్లు. మాకు రాబందులనీ, తోడేళ్ళనీ, అప్పులవాళ్ళనీ, బాకీదార్లనీ ఇంగ్లీషులోనూ తెలుగులోనూకూడా నామకరణంచేశారు. ఆ నామకరణాలన్నీ మేం బిరుదులకింద స్వీకరించాం. మేం చాలా ఘనులమని అనుకునేవాళ్లం.

ఈ సిద్ధాంతం మా తలకాయల్లో క్రమక్రమంగా ఒకస్వరూపం దాల్చింది. దీనికి ఆ స్వరూపం ఇవ్వటానికి బుర్రతో విశేషంగా పనిచేసినవాణ్ణి నేనే. అయితే మిగిలినముగ్గురూ సంపూర్ణంగా ఆమోదించారు. ఆవిధంగా అది మా ఉమ్మడి సిద్ధాంతమయింది.

* * *

ఆ హోటలుకు ఒక కొత్తమనిషి రాసాగాడు. అతను తెలుగువాడని తెలుస్తూనేఉంది. కాని, నలుగురం సాటివాళ్ళం గట్టిగా మాతృభాషలో అరుస్తూ, వడ్డించేవాళ్ళకి తెలుగు నేర్పుతూ సందడిగా భోంచేస్తున్నాకూడా, అతను మాకేసి చూడనైనా లేదు. పొడిఅరవం ముక్కల్తో పని కానిచ్చుకుని భోంచెయ్యసాగాడు.

అతను భోంచేసేవైఖరిచూస్తే మాకు చాలా "బూర్జువా" గా కనిపించింది. (ఆరోజుల్లో మా సిద్ధాంతాలకు భిన్నంగా ఉన్నదల్లా మాకు బూర్జువాగా కనిపించేది.) అతను భోంచేస్తూ నెయ్యి వడ్డించేటప్పుడు చాలుననేవాడు. వడ్డించేవాడు వేసేదే రెండుగరిటెలు. ఎక్కువ కావలిసినా ఎక్స్ట్రా ఇస్తే తప్ప ఒక్కచుక్కయినా రాల్చడు. అది అందరికీ తెలుసు. అటువంటప్పుడు చాలునని చెయ్యి విస్తరి కడ్డంపెట్టటం బూర్జువా కాదూ? పైగా ఒకరోజా, రెండురోజులా? రోజూ, రెండుపూట్లా ఇదేవరస. అతను అత్తవారింట అల్లుడులాగా భోజనంచేస్తుంటే అతని "మర్యాద" చూసి మొదట మాకు పళ్ళాక్రోశంగా ఉండేది. అది రానురాను తృణీకారభావం కిందికి మారింది.

"వీడికి ఫైను వెయ్యాలిసిందేరా!" అన్నాడు మద్దూరి.

"ముందు వీడిపరిచయంచేసుకుందాం పట్టండి", అన్నాడు నాదెళ్ల.

ఓరాత్రి భోజనానంతరం అతన్ని పలకరించి పంచాంగంవాడిగదికి తీసుకుపోయి అక్కడ అతని ఆరాకొంత తీశాం. అతనిమాటల తీరులోకూడా ఆ మర్యాదా లోభత్వం కనిపించింది. మాఅందరిదగ్గరా తలా కాస్తాగార వసూ సంపాదించి చంకన పెట్టుకుపోదామని అతని ఉద్దేశం! ఫైను తప్పక వెయ్యాలిసిందే.

ఆ పూటకి అతనిచేత కిళ్లీలూ సిగరెట్లూ కొనిపించి ఫైను వేశాం. తీరా చూస్తే అతను కిళ్లీ వెయ్యడు, సిగిరెట్టు ముట్టడు, కాని ఫైను చెల్లించాడు—సంతోషంతోనే.

"మాపద్ధతులు మీకు కాస్తవిపరీతంగా తోస్తాయేమో. కాని ఎరిగినవాళ్లకి ఫైనువెయ్యటం మేము తప్పుగా భావించం. మమ్మల్ని మీరుకూడా వెయ్యొచ్చు. ఉన్నవాడూ లేనివాడూ దాదాపు ఒకేవిధంగా బతకటానికిది మంచిపద్ధతని మేం తేల్చుకున్నాం," అన్నాడు నాదెళ్ళ.

"మీరు మార్క్సు పుస్తకాలు చదివారా ఏం?" అన్నాడతను.

మా సంస్కారమంతా మంటగలిపి మమ్మల్ని కామ్రేడ్లక్రింద జమకడుతున్నందుకు మాకు కోపంవచ్చింది.

"మేమటువంటి చెత్త చదవం. మీరు చదవకండి" అన్నాం.

"మీరొకవేళ సోషలిస్టులేమో అనుకున్నాను" అన్నాడతను.

"ఎంతమాట! కావలిస్తే మాది కల్చరల్ కమ్యూనిజం అనండి," అన్నాం.

"మీ కల్చరల్ కమ్యూనిజం డబ్బుతోకూడి ఉన్నట్లు కనిపిస్తుంది?" అన్నాడతను.

"డబ్బుకు మేం తక్కువ స్థానం ఇస్తాం. సంస్కారం ముందొస్తుంది."

"అదావిషయం?...మంచిది, సెలవు. మళ్ళీకలుస్తాను."

* * *

ఆరోజు లగాయతు అతనికి ఫైనులు తగిలిస్తూవచ్చాం. అతనెక్కడా వెనకాడలేదు. కాని అతను మాకు ఫైను వేసినపాపాన పోలేదు. మానలుగురిలో ఒకరికొకరు ఫైనలువేసుకోవటం చాలా తగ్గిపోయింది. అందరిదగ్గిరా డబ్బు కనిపిస్తున్నది-ఏడోతారీకు దాటినతరువాత కూడా.

ఎప్పుడన్నా దారితప్పి మాలోమేం ఏ సినిమా ప్రోగ్రాంగాని పెట్టుకున్నప్పుడు మా కొత్తస్నేహితుణ్ణి పిలవాలనే ఆలోచన మాకుకలిగేదికాదు.

నాసిద్ధాంతానికి అపాయం కలుగుతున్నట్టు కనిపించి నేనేకొంచెంసణగసాగాను. అతన్నికూడా మా వెంట పిలవటం సంస్కారరీత్యా అవసరంగా కనిపించింది.

"ఎందుకులేరా? పోనిస్తూ! వెధవ సినిమాకు అతను కావాలంటే పోలేడా? డబ్బున్నవాడల్లే నే ఉన్నాడులే. ఎందుకొచ్చినఖర్చు? సిగిరెట్లన్నా తగలెయ్యొచ్చు," అన్నారు నాతోటిసంస్కార్లు. నాకుమండిపోయి "మనం సోషలిస్టులమా?" అని అడిగాను.

"ఎంతమాత్రమూ కాము. అయితే మటుకు డబ్బువృధాగా తగలెయ్యాలా ఏమిటి?" అన్నారు వాళ్ళు.

నేనారోజు వాళ్లవెంట సినిమాకు వెళ్ళలేదు.

"మరో తొమ్మిదణాలు ఆదా!" అన్నారు వాళ్లు నా మొహానే!

* * *




నేను చాటుగా మా హోటలు స్నేహితుడితో పరిచయం ప్రారంభించాను.

"మీరు మాకోసం డబ్బెందుకు ఖర్చు చేస్తున్నారు? మేం డబ్బుకోసం మీ వెంటపడటంలేదని మీకెట్లా తెలుసు?" అన్నానొకసారి.

"డబ్బుకోసమే నా వెంట పడుతున్నారు. కాదని నేనెన్నడూ అనుకోలేదే," అన్నాడతను.

నాకు కోపంవచ్చింది. కాని దాన్ని ప్రకటించేటందుకు నాకర్హత ఉన్నట్లు కనిపించలేదు.

"అయితే మరెందుకు ఖర్చు చేస్తున్నారు?"

"డబ్బుకోసం వెంటపడుతున్నారు గనక డబ్బిస్తున్నాను. డబ్బక్కర్లేని వాళ్లకి డబ్బిచ్చి ఏంలాభం?"

"డబ్బు అందరికీ ఇస్తారా? అంత డబ్బుందా మీదగ్గిర?"

"లేదు. కాని ముందు డబ్బిచ్చి తరవాత సంస్కారంకూడా ఇద్దామనే!"

"మాకు సంస్కారంలేదా?"

"అవసరమైన సంస్కారంలేదు."

"ఏమిటా సంస్కారం?"

"సంస్కారంకన్న డబ్బే ప్రధానమయిందనే జ్ఞానం. మీరు సంస్కారంకోసం దేవులాడుతూంటె మీ చేతికి డబ్బే దొరుకుతున్నది. మీ చేత డబ్బుకోసం దేవులాట ఆరంభింపచేసి సం

స్కారం ఇప్పింతామని నాకు ఆలో
చనకలిగింది."

నా కనుమానంవేసింది.

"మీరు మార్క్సు పుస్తకాలుగాని చదవలేదు గదా?"

"కొద్దిగా చదివాను."

"సోషలిస్టే?"

"కొంతవరకు"

హతాశుణ్ణయిపోయినాను.

"మాచేత ఏం చేయింతామని మీ ఉద్దేశం?"

"పొలం దున్నింతామని"

"పొలం దున్నించటమే? ఎక్కడ?"

"భద్రాచలందగ్గిర. నూరెకరాలు కొన్నాను, అక్కడి మనుషుల్ని పెట్టి అంతా నేనే చేయించగలను. కాని ఇక్కడ డబ్బుకోసం అగచాట్లుపడే చదువుకున్నవాళ్ళని పట్టుకెళ్ళి వాళ్ళు చేయగలిగినంత భూమి ఇచ్చేసి ఒక కాలనీ ఏర్పరచాలనుకున్నాను. హాయిగాతిన్నది అరిగేట్టు పనిచేసుకోవచ్చు. కూలీలతో సరిసమానంగా జీవించవచ్చు. వాళ్ళకి సంస్కారం ఇవ్వొచ్చు. వాళ్ళకూడా మనంతవాళ్ళుగా పరిణమిస్తుంటే ఆపరిణామం చూసి ఆనందించవచ్చు. వాళ్ళని మనం దోచుకుండా వుండే వాళ్ళు మనకన్నా సంపాదనల్లో ఎంతముందుకు పోతారో తెలుసుకోవచ్చు. ఇదంతా సంస్కారమూ, అనుభవమూ కాదా?" అన్నాడతను.

"అంతదూరంవెళ్ళి కాయకష్టంపడే కన్న ఇక్కడే తేలికఉద్యోగాలు సంపాదించి హాయిగా పుస్తకాలు చదువుకుంటే—" అని ప్రారంభించాను.

"తేరగా డబ్బొస్తుంటే సంస్కారం రాదు, గమనించే ఉంటారు. పుస్తకాలు ఎన్నటికీ అనుభవంకాదు ... ఏమిటి, వస్తారా? మీస్నేహితుల కూడా చెప్పండి, ఆహ్వానించానని. కానీ పెట్టుబడిలేదు. చేసుకున్నంతభూమి ఇస్తాను. వాళ్ళకి డబ్బుమీద ఇష్టంలేక నా ఆహ్వానం రుచించకపోవచ్చు. అయినా చెప్పి చూడండి," అన్నాడు.

"చెబుతానులెండి ... నామటుకు నేను... ఇంకా కనీసం రెండేళ్ళవరకూ ఇంటిపట్టున ఉండి—ఏదీ?—"అన్నాను.

"మీయిష్టం," అన్నాడతను.

అంతే మళ్ళా నాకాగొడవే జ్ఞాపకంలేదు. ఇప్పుడిదంతా ఎందుకు జ్ఞాపకంవచ్చిందంటే ఈమధ్య నేను మద్దూరి వాడికి ఓ పత్రిక పంపించరా అని రాస్తే లేదని సమాధానంరాసి ఆమర్నాడే కొత్తమేడకు పునాదితవ్వించటం మొదలుపెట్టాడు. నాహోటలు స్నేహితుడికన్నా రాద్దామంటే అతని పేరే జ్ఞాపకంలేదు. కాకపోయినా ఈయుద్ధంరోజుల్లో నాలుగెకరాలన్నా లేని నాబోటివాడికి మరీ ఇబ్బందిగా ఉంది. రెండెకరాలున్న వాళ్ళుకూడా గొప్పవాళ్ళయి కూర్చున్నారు మరీనూ!

